సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
9705347494
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

అధినేతను కలిసిన ముత్తంశెట్టి



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస రావు బుధవారం తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భీమిలి నియోజకవర్గానికి చెందిన పలు విషయాలపై చర్చించారు. - తగరపువలస

మాజీ మండల అధ్యక్షుడు మృతి



కోడిబోయిన రమణ (ఫైల్)

కొమ్మాది: వైఎస్సార్‌సీపీ భీమిలి మండల మాజీ అధ్యక్షుడు, జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడకు చెందిన కోడిబోయిన రమణ (53) బుధవారం మృతి చెందారు. గుండెనొప్పి రావడంతో హుటాహుటిన కుటుంబ సభ్యులు ఆయన్ను నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. రమణ మృతిపై మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు సంతాపం ప్రకటించారు.


ఎయిడ్స్‌పై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విష్ణుమూర్తి

భీమునిపట్నం: ప్రాణాంతకమైన ఎయిడ్స్ వ్యాధిపై ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.విష్ణుమూర్తి సూచించారు. ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ కళాశాల వద్ద బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ వ్యాధి సోకితే, వ్యాధి నిరోధక శక్తిని కోల్పోయి ప్రాణాలు పోయే పరిస్థితులు ఉంటాయని, అందరూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ మేనేజర్ రవి భాస్కర్ మాట్లాడుతూ ఈ వ్యాధి ఎలా వస్తుంది, రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న దానిపై వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్‌ల ప్రోగ్రాం అధికారులు డాక్టర్ డి.ప్రవీణ, డాక్టర్ ఎస్.అప్పలనాయుడు, డాక్టర్ బి.సహదేవుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు



ట్రిపుల్ ఆర్ సెంటర్‌ను పరిశీలిస్తున్న అడిషనల్ కమిషనర్ రమణమూర్తి

కొమ్మాది: వర్షాలు పడుతున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున చర్యలు తీసుకోవాలని అడిషనల్ కమిషనర్ వి.వి. రమణమూర్తి ఆదేశించారు. జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో బుధవారం ఆయన పర్యటించారు. ఎస్సీ కాలనీ, బీసీ కాలనీల్లో గడప గడపకు వెళ్లి తడిచెత్త, పొడిచెత్త సేకరణ తీరును పరిశీలించారు. వార్డులో ఎక్కడా డ్రైనేజీల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా శానిటేషన్ సిబ్బంది చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎప్పటికప్పుడు అన్ని ప్రాంతాల్లో బ్లీచింగ్, స్ప్రేయింగ్ నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం ట్రిపుల్ ఆర్ సెంటర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శైలజా వల్లి, ఏఎంహెచ్‌వో డా. ఎస్.కిషోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

కళలపై మమకారంతో..

- పండగ వేళల్లో ప్రదర్శనలు
- ప్రశంసలందుకుంటున్న కళాకారులు



కోలాటం ఆడుతున్న చంద్రంపాలెం కోలాటం కళాకారిణులు



చెట్టు భజన చేస్తున్న మల్లయ్యపాలెం కళాకారులు

నేడు ప్రపంచ జానపద దినోత్సవం

మధురవాడ: భారతీయ సంస్కృతిలో కళలది ప్రత్యేక స్థానం. కళలు శతాబ్దాలుగా ప్రజలకు వినోదాన్ని, ఆనందాన్ని, సమాచారాన్ని, సందేశాన్ని సూటిగా మనసుకు హత్తుకునే విధంగా చేరవేయడమే కాకుండా, ఆయా ప్రాంత సంస్కృతీ, సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా ఉంటున్నాయి. వాటిలో జానపద ప్రదర్శనలు, కళారూపాలకు విశేష ఆదరణ లభించేది. ఆధ్యాత్మికం, సంస్కృతి, సాంఘిక సంక్షేమం, వినోదం.. ఇలా ప్రజలకు సులువుగా సందేశాన్ని చేరవేస్తోంది. ప్రపంచీకరణ, విస్తృతమైన సాంకేతిక పరిజ్ఞానం తదితర కారణాలతో కళల పట్ల ఆదరణ తగ్గుతున్నా.. ఇప్పటికీ కొందరు కళాకారులు కళపై మమకారంతో కళారూపాలను ప్రదర్శిస్తున్నారు. వివిధ రంగాల్లో స్థిరపడిన వారు సైతం కళల పరిరక్షణకు కృషి చేస్తున్నారు.

వందల సంఖ్యలో కళాకారులు

జీవీఎంసీ 5, 6, 7, 8 వార్డుల్లో సుమారు లక్షపైనే జనాభా ఉంది. ఈ ప్రాంతంలో మల్లయ్యపాలెం, నగరంపాలెం, బక్కన్నపాలెం, రేవళ్లపాలెం, కొమ్మాది, చంద్రంపాలెం తదితర ప్రాంతాలకు చెందిన కళాకారులు కళల పరిరక్షణ, వాటి ప్రచారంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ముఖ్యంగా ఇక్కడ చెట్టు భజన, కోలాటం, గరిడీ సేవ, తప్పెటగుళ్ల తదితర కళలకు చెందిన కళాకారులు వందల సంఖ్యలో ఉన్నారు. మోడర్న్, వెస్టర్న్ మ్యూజిక్ ప్రభావం విశేషంగా ఉన్న పట్టణ ప్రాంతంలో కూడా ఏ ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగినా ఈ ప్రదర్శనలు ఇస్తున్నారు. దీనిని బతుకుతెరువుగా కాకుండా వాటి పట్ల ఉన్న మమకారంతో పరిరక్షణకు కృషి చేస్తున్నారు. విశాఖలో ఈ నెల 22న జరగనున్న జానపద సంబరాల్లో మల్లయ్యపాలెం శ్రీ సీతారామ భజన మండలికి చెందిన కళాకారులు ప్రదర్శన ఇవ్వనున్నారు.

ఆకట్టుకుంటున్న కోలాటాలు

చంద్రంపాలెం శ్రీమన్నారాయణ కోలాటం గ్రూపుతో పాటు నగరంపాలెం తదితర ప్రాంతాలలో పలువురు గృహిణులు కోలాట ప్రదర్శనలు ఇస్తున్నారు. ప్రపంచ జానపద కళల దినోత్సవాన్ని పురస్కరించుకుని కొందరి కళాకారుల మనోగతం..

కళాకారుడిగానే సంతృప్తి



నేను బిల్డర్‌ను. కళలంటే ప్రాణం. చిన్నప్పటి నుంచి నాటకాలు, చెట్టు భజన, బైటో భజన, చెక్క భజన వంటివాటిపై ఎంతో ఆసక్తి. మధురవాడ ప్రాంతంలో కళను జీవనోపాధిగా కాకుండా వాటిపై మమకారంతో ప్రదర్శనలు ఇచ్చేవారు నాలా అనేక మంది ఉన్నారు. నేను, నా కుటుంబ సభ్యులు, మిత్రులు ప్రతి ఏడాది మా ఇలవేల్పుల జాతర, పండగల్లో తరచూ ప్రత్యేక కళాప్రదర్శనలు ఏర్పాటు చేస్తుంటాం. వాటిలో నేను కూడా కళాకారుడిగా పాల్గొంటాను. కళాకారుడిగానే నేను ఎక్కువ సంతృప్తి పొందుతాను.

– అల్లాడ వెంకటరావు, కళాకారుడు, మధురవాడ

కళల పరిరక్షణ.. దైవ సేవ



నాకు కోలాటమంటే చాలా ఇష్టం. అలా ఆసక్తి ఉన్న చంద్రంపాలెం గ్రామ మహిళలం కలసి శ్రీమన్నారాయణ కోలాట బృందంగా ఏర్పడ్డాం. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పలు దేవాలయాలు, జాతరల్లో ప్రదర్శనలు ఇస్తుంటాం. ఈ కోలాట ప్రదర్శన ద్వారా దైవ సేవ చేయగలుగుతున్నామనే సంతృప్తి ఉంది. పైగా ఇది మాకు పెద్దలు ఇచ్చిన సంపద. కళలు పరిరక్షించేందుకు మా పాత్ర పోషిస్తున్నాం.

– మరుపిల్లి ఉషారాణి, కోలాట కళాకారిణి, చంద్రంపాలెం

ఎమ్మెల్యే దృష్టికి శ్మశాన వాటిక సమస్య



ఎమ్మెల్యే గంటాకు వినతిపత్రం అందిస్తున్న మత్స్యకారులు

భీమునిపట్నం: భీమిలి బీచ్‌రోడ్డులోని జలగెడ్డ స్మశాన వాటిక సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఎగువపేట గ్రామాభివృద్ధి సేవా సంఘానికి చెందిన మత్స్యకారులు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు బుధవారం వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ అయిదు శతాబ్దాలుగా మత్స్యకారులు ఈ శ్మశానవాటికను వినియోగిస్తున్నారన్నారు. మరణించిన అనంతరం తమ ఆచారం ప్రకారం అక్కడే ఖననం చేస్తామని తెలిపారు. ఆ ప్రాంతాన్ని తాము ఎంతో గౌరవిస్తామని, అటువంటి ప్రాంతాన్ని కొందరు ఆక్రమించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడడంతో వేదనకు గురవుతున్నామన్నారు. అధికారులకు తగిన ఆదేశాలిచ్చి న్యాయం జరిగేలా చూడాలని కోరగా, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు వారు చెప్పారు. కార్యక్రమంలో సేవా సంఘం అధ్యక్షుడు గంటా నూకరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లిపిల్లి నర్సింగరావు, సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

తగరపువలస: చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని జోన్-3 ఈఈ (ఆపరేషన్స్) పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా తగరపువలస మెయిన్‌రోడ్డు, చిట్టివలస, కొత్తపేట, సంతపేట, కొండపేట, బంగ్లామెట్ట, గణేష్ థియేటర్ రోడ్డు, ఆదర్శనగర్, సప్తగిరి లే అవుట్, జ్యూట్ మిల్లు క్వార్టర్స్, రామన్నపేట, చిల్లపేట, జీరుపేట, ఊళ్లపేట, సంగివలస ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే, భీమిలి మండలంలోని తాటితూరు, టి.నగరపాలెం, మజ్జివలస, శింగనబంద, లక్ష్మీపురం, విజయరాంపురం, నారాయణరాజుపేట పంచాయతీలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలియజేశారు.

27న జోన్-1లో బహిరంగ వేలం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్‌లోని దుకాణాలు, రోడ్డు మార్జిన్లు, మార్కెట్లకు ఈ నెల 27న ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు జెడ్సీ కె.కనకమహాలక్ష్మి తెలిపారు. మూడో వార్డులోని పెద్ద బజారు మీ సేవ మేడపై దుకాణాలు, భీమిలి రోడ్డులోని జీ ప్లస్ 1 దుకాణాలు మూడేళ్ల కాలపరిమితికి వేలం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. అలాగే భీమిలి రోడ్డు మార్జిన్, లాల్ బహదూర్ శాస్త్రి మార్కెట్, కలిగొట్ల సూర్యనారాయణ నాయుడు మార్కెట్లకు 31.03.2025 వరకు గుత్తగా ఇచ్చేందుకు జెడ్సీ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఆసక్తి గలవారు పూర్తి వివరాల కోసం కార్యాలయ పనిదినాల్లో సంప్రదించాలని కోరారు.

పీఎండీఎస్‌తో భూసారం వృద్ధి



కోరాడలోని మామిడి తోటలో విత్తనాలు జల్లుతున్న అధికారులు

పద్మనాభం: ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్) వల్ల మామిడి, జీడి మామిడి తోటలు ఉన్న భూముల్లో భూసారం పెరుగుతుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.అప్పలస్వామి, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మోహనరావు అన్నారు. మండలంలోని కోరాడలో బుధవారం పీఎండీఎస్ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం సాగులో భాగంగా పీఎండీఎస్ కింద పెసర, రాగులు, గంటి, మినప వంటి 30 రకాలు విత్తనాలను మామిడి, జీడి మామిడి తోటల్లో వేస్తున్నట్టు తెలిపారు. దీని వల్ల ఏళ్ల తరబడి దున్నకుండా ఉన్న మామిడి, జీడి మామిడి తోటల్లో భూసారం పెరిగి కాపు బాగుంటుందని చెప్పారు. ఈ విత్తనాలు వేయడం వల్ల రైతులు అంతర పంటలు, ప్రధాన సాగు అయిన మామిడి, జీడి మామిడి తోటల ఫలసాయాలను పొంది ఆర్థిక స్వావలంబన సాధించవచ్చన్నారు. దీనిలో భాగంగా వీరు కోరాడలో 10 ఎకరాల మామిడి తోటలో 30 రకాల విత్తనాలను జల్లారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ఆర్‌టీఎల్ హేమసుందర్, అప్పలనాయుడు పాల్గొన్నారు.

‘పీఎం సూర్యఘర్ యోజన’తో విద్యుత్ బిల్లుల ఆదా

తగరపువలస: ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా ప్రభుత్వం ఇచ్చే రాయితీని సద్వినియోగం చేసుకుని నెలవారీ విద్యుత్ బిల్లులు తగ్గించుకోవాలని విద్యుత్‌శాఖ డిప్యూటీ ఈఈ ఆర్.రమేష్ కోరారు. ఈ పథకం ప్రకారం ఒక కిలో వాట్‌కు రూ.30వేల ప్రభుత్వ రాయితీ లభిస్తుందన్నారు. రెండు కిలో వాట్లకు రూ.60వేలు, మూడు కిలోవాట్లకు గరిష్ఠంగా రూ.78వేలు రాయితీ లభిస్తుందని తెలిపారు. ఈ పథకం ద్వారా వినియోగదారుల వద్ద మిగులు విద్యుత్ ఉత్పత్తి అయితే దానికి ధర కూడా చెల్లిస్తామన్నారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేందుకు గాను మూడు వర్గాలుగా విభజించారన్నారు. సోలార్ ప్యానళ్ల కోసం వినియోగదారులు ఏ సంస్థనైనా సంప్రదించవచ్చన్నారు. మిగిలిన వివరాల కోసం సమీపంలో ఉన్న సబ్‌స్టేషన్ల నుంచి లేదా నోడల్ అధికారిని 94906 10002 నంబరులో సంప్రదించి గానీ పొందవచ్చన్నారు.

మూడు కేటగిరీల్లో..

- మొదటిది గృహ వినియోగదారులకు ఉద్దేశించి ఇంటిపై కప్పుపై కనీసం 10 చదరపు మీటర్లు కలిగి ఉండాలి. వీరికి ఒక కిలోవాట్‌కు గాను మొత్తం ఖర్చు రూ.1,10,000 కాగా ప్రభుత్వ రాయితీ పోను రూ.78వేలు షెడ్యూల్ బ్యాంకుల నుంచి రుణంగా లభిస్తుందని డిప్యూటీ ఈఈ తెలిపారు.
- రెండోది ప్రభుత్వ కార్యాలయాలకు ఉద్దేశించినది.. తహసీల్దార్, ఎంపీడీవో, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర ప్రభుత్వ కార్యాలయాలపై ఎంత స్థలం ఉన్నా వాటి వివరాలతో సంప్రదిస్తే తమ శాఖ నుంచి ఇనస్టలేషన్ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు.
- మూడోది గ్రామాలలో స్థలాలు కలిగిన రైతులు ఒక ఎకరం తమకు ఇస్తే అందులో సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేసుకుని రైతుకు ఏడాదికి రూ.31వేలు చెల్లిస్తామన్నారు. ఒక మెగావాట్ విద్యుత్ ఉత్పత్తికి 4.50 ఎకరాలు అవసరమన్నారు. కొందరు రైతులు కలిసి ఉమ్మడిగా గరిష్ఠంగా ఎంత భూమినైనా ఇవ్వవచ్చన్నారు. రైతుకు చెల్లించే మొత్తం ప్రతి ఏడాది పెరుగుతుందన్నారు. దీంతో స్థానికంగా రైతులకు నేరుగా 9 గంటలు విద్యుత్ సరఫరా చేయడానికి వీలు ఉంటుందన్నారు.

ఏబీవీపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదులో మాట్లాడుతున్న ఏబీవీపీ ప్రతినిధులు

తగరపువలస: అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో చిట్టివలస శ్రీకృష్ణా జూనియర్, డిగ్రీ కళాశాలలో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఏబీవీపీ రాష్ట్ర ప్రతినిధి లొడగల అచ్చిబాబు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై పరిష్కారానికి ఏబీవీపీ నిరంతరం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులలో దేశభక్తిని పెంపొందిస్తూ ధర్మంవైపు నడిపించేలా పని చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి బత్తుల వంశీ, రాజేష్, గౌరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొందరికే కోడిగుడ్లు, పప్పు చెక్కీలు

తగరపువలస: ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజనంలో విద్యార్థులందరికీ కోడిగుడ్లు, పప్పుచెక్కీలు అందించలేక ప్రభుత్వం గుడ్లు తేలేసింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులను కోడిగుడ్లు, పప్పు చెక్కీల కోసం తల్లిదండ్రులు నిలదీస్తున్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్సార్‌సీపీ పాలనలో అమలులో ఉన్న జగనన్న గోరుముద్ద పథకాన్ని డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పేరుతో మార్పు చేసి, మెనూలో స్వల్పంగా మార్పులు చేర్పులు చేశారు. దీని ప్రకారం వారంలో శనివారం తప్ప అయిదు రోజులు కోడిగుడ్లు, మూడురోజుల పాటు (సోమ, బుధ, శుక్ర వారాల్లో) వేరుశనగ బెల్లం చిక్కీ విద్యార్థులకు అందించాలి. అయితే, ఈ ఏడాది వేసవి సెలవుల అనంతరం జూన్ 13న పాఠశాలలు పునః ప్రారంభించిన రోజు ఉన్న రోల్ ప్రకారమే ప్రస్తుతం పాఠశాలలకు కోడిగుడ్లు, వేరుశనగ బెల్లం చిక్కీలు సరఫరా చేస్తున్నారు. పునఃప్రారంభమై, పాఠశాలల్లో అడ్మిషన్లు పెరిగినా కోడిగుడ్లు, వేరుశనగ పప్పు చెక్కీల సంఖ్య పెంచలేదు. కొన్ని పాఠశాలలకు జూన్, జూలై మాసాల్లో విద్యార్థుల సంఖ్యకు సరిపడనంతగా ఈ రెండూ అందించినా, ఆగస్టులో మాత్రం చాలా పాఠశాలలకు కోత విధించారు.

పునఃప్రారంభం తరువాత విద్యార్థుల సంఖ్య తగ్గిన పాఠశాలల్లో ఎలాంటి సమస్యలు లేకపోయినా, విద్యార్థుల సంఖ్య పెరిగిన చోట్ల వీటి కొరత గ్రామంలో తగాదాలను సృష్టిస్తోంది. ఒక పిల్లాడికి ఇచ్చి మరో పిల్లాడికి ఇవ్వకపోవడంతో ఇరుగు పొరుగు వారి మధ్య మనస్పర్థలు పెరుగుతున్నాయి. అంతేకాకుండా పాఠశాలల్లో పేర్లు నమోదైన దివ్యాంగ విద్యార్థులకు భవిత కేంద్రాల ద్వారా కోడిగుడ్లు, వేరుశనగ బెల్లం చిక్కీలు అందించవలసి ఉన్నా సరిపడా సరఫరా లేక బడిభోజన పథకం నీరుగారుతోంది. కోడిగుడ్లు, వేరుశనగ బెల్లం చిక్కీల కొరత విషయాన్ని చాలా వరకు ప్రధానోపాధ్యాయులు రహస్యంగా ఉంచుతూ అధికారుల దృష్టికి కూడా తీసుకువెళ్లడం లేదు.

అమరావతిలో రోల్ సంఖ్య మార్చితేనే..

పాఠశాలలకు కోడిగుడ్లు, వేరుశనగ బెల్లం చిక్కీల సరఫరా కొరతపై ఉపాధ్యాయులను వివరణ కోరగా అమరావతిలో ప్రభుత్వం వద్ద ఉన్న రోల్ ప్రకారమే సరఫరా అవుతున్నట్టు తెలిపారు. సెప్టెంబరు ఒకటిన రోల్ మార్చేవరకు తమకు తిప్పలు తప్పవని ఉపాధ్యాయులు వాపోతున్నారు.

విలేకరిపై ఉపాధ్యాయుడి జులుం

మధ్యాహ్న భోజన పథకంలో కోడిగుడ్లు, వేరుశనగ బెల్లం చిక్కీల కొరత గురించి ఆరా తీసే ప్రయత్నంలో భీమిలి మండలం తాళ్లవలస జెడ్పీ హైస్కూల్‌లో ప్రయత్నించగా రాజ్‌కుమార్ అనే ఉపాధ్యాయుడు స్థానిక సాక్షి విలేకరిపై దౌర్జన్యం చేసి ఫోన్ లాక్కున్నారు. తరువాత ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్‌రావు అతని తరపున తప్పు ఒప్పుకుని, ఫోన్ తీసుకువచ్చి అప్పగించారు.

అనిట్స్ కూడలిలో ఫుట్‌పాత్‌పై ఆక్రమణల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



ఫుట్‌పాత్‌పై ఆక్రమణలు తొలగిస్తున్న హైవే సిబ్బంది, భీమిలి ట్రాఫిక్ పోలీసులు

తగరపువలస: సంగివలస ముగ్గురు అమ్మవార్ల ఆలయం ఎదురుగా అనిట్స్ కూడలిలో ఫుట్‌పాత్‌పై ఆక్రమణలను బుధవారం హైవే సిబ్బందితో పాటు భీమిలి ట్రాఫిక్ పోలీసులు క్లియర్ చేశారు. ఫుట్‌పాత్ మీదకు వచ్చి దుకాణాలు ఏర్పాటు చేసుకోవడం, భవన నిర్మాణ మెటీరియల్ ఉంచడంతో ప్రయాణికులు, విద్యార్థులు సర్వీస్ రోడ్లపై నిలిచిపోవడంతో నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. దీనిపై ‘అనిట్స్ కూడలిలో వాహనాల గందరగోళం’ శీర్షికతో సాక్షిలో బుధవారం ప్రచురితమైన వార్తకు వారు హైవే సిబ్బంది, పోలీసులు స్పందించారు. కూడలి చుట్టూ ఆక్రమణలు తొలగించారు. మళ్లీ ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇందులో భీమిలి ట్రాఫిక్ ఎస్ఐ చింతలపూడి చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు. ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

మహిళలపై దాడులు అరికట్టాలి



అంబేడ్కర్ కూడలిలో నిరసన తెలియజేస్తున్న సిటూ, ఐద్వా ప్రతినిధులు



మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ ప్రతినిధులు

తగరపువలస: మహిళలపై పెరుగుతున్న దాడులను అరికట్టాలని కోరుతూ భీమిలి జోన్ సిటూ, ఐద్వా మహిళలు అంబేడ్కర్ కూడలిలో నిరసన చేపట్టారు. కోల్‌కత్తాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారానికి నిరసనగా జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడారు. ఎన్నో చట్టాలు ఉన్నా దేశంలో రోజురోజుకు లైంగికదాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు.అందువలన చట్టాలను కఠినం చేసి అక్కడికక్కడే శిక్ష విధించేలా సవరణలు చేయాలని డిమాండ్ చేశారు. కోల్‌కతా సంఘటనలో నేరస్తులు మరింతమంది ఉన్నారని, వారిని కూడా పట్టుకుని శిక్షించాలన్నారు. రాష్ట్రంలో, దేశంలో మత్తు పదార్థాల వాడకం, అసభ్యకరమైన సినిమాలు, సెల్‌ఫోన్లు యువత పెడత్రోవ పెట్టడానికి కారణాలన్నారు. అలాంటి వాటిపై ఉక్కుపాదం మోపాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీదేవి, రవ్వ నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు, పద్మలక్ష్మి, శాంతమ్మ, సమ్మిడి గున్న, రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మధురవాడలో..

మధురవాడ: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సీఐటీయూ మధురవాడ జోన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.రాజ్‌కుమార్, డి.కొండమ్మలు డిమాండ్ చేశారు. కోల్‌కతా ఘటనను వ్యతిరేకిస్తూ మధురవాడ జోనల్ కార్యాలయం ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం సాయంత్రం నల్ల బ్యానర్, ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాత్రనక, పగలనకా శ్రమించి ప్రజల ప్రాణాలు కాపాడుతున్న వైద్యులకు రక్షణ కల్పించలేని స్థితిలో ప్రభుత్వాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు మంగశ్రీ, పుష్ప, సావిత్రి, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్ఎస్ కళింగలో జలతరంగ్ చాంపియన్‌షిప్



ట్రోఫీతో విజయం సాధించిన స్విమ్మర్లు

తగరపువలస: భీమిలి బీచ్‌రోడ్డులోని నేవల్ స్టేషన్ కళింగలో ఉద్యోగుల అంతర విభాగాల జలతరంగ్ చాంపియన్‌షిప్ పేరుతో బుధవారం స్విమ్మింగ్ పోటీలు నిర్వహించారు. అగ్నివీర్‌ల భాగస్వామ్యంతో స్విమ్మర్లు పోటీల్లో పాల్గొని, అద్భుతమైన ప్రదర్శనలు ఇచ్చారు. అధికారులు మాట్లాడుతూ వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులు ఈ పోటీల్లో ఐక్యత చాటిచెప్పారన్నారు. గెలిచిన స్విమ్మర్లకు నిర్వాహకులు ట్రోఫీలు అందించారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



సూపరింటెండెంట్‌కు చెక్కు అందజేస్తున్న దాత

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని బాలాజీ గార్డెన్స్‌కు చెందిన గరిమెళ్ల సార్య వెంకటలక్ష్మీనారాయణ లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. సింహగిరిపై పీఆర్వో కార్యాలయంలో విరాళాన్ని చెక్కు రూపంలో సూపరింటెండెంట్ సిరిపురపు కనకరాజుకు బుధవారం అందజేశారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని అధికారులు అందించారు. దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

కృష్ణాష్టమి వేడుకలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

తగరపువలస: ఈ నెల 26 నుంచి భీమిలి మండలం తాటితూరులో జరగనున్న శ్రీకృష్ణాష్టమి వేడుకలకు హాజరు కావాలని కోరుతూ త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి ప్రతినిధులు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును బుధవారం ఆహ్వానించారు. సెప్టెంబరు 5 వరకు 11 రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సమితి ప్రతినిధులు రావణ అక్షయ్, మొక్క వెంకటరమణ, ఆదినారాయణ, బాలకృష్ణ, గణేష్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై శిక్షణ



మాట్లాడుతున్న అధికారులు

మధురవాడ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల పరిశుభ్రత గురించి సార్క్ సంస్థ, సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డెటాల్ బనేగా స్వస్థ్ ఇండియా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవోలు రవీంద్రబాబు, అనురాధ సబ్బుతో చేతులు కడుక్కున్నప్పుడు పాటించవలసిన 7 సూత్రాల గురించి వివరించారు. డీబీఎస్ఐ స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ ఏఎస్ కుమారి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చూడిగేదెకు చికిత్స

తగరపువలస: ఆనందపురం మండలంలో మాయ దిగిన చూడిగేదెకు పశువైద్యాధికారి పొట్నూరు అనిల్ ఆధ్వర్యంలో లోపలపెట్టి విజయవంతంగా కుట్లు వేశారు. ఆయన మాట్లాడుతూ చూడి పశువులకు సరైన పౌష్టికాహారం ఇవ్వకపోవడంతో ప్రసవానికి మూడు నెలల ముందు మాయ దిగుతుందన్నారు. ఇది పశువులకు ప్రాణాంతకమే కాకుండా రైతుకు ఆర్థిక భారమన్నారు. అందువలన పశువులలో కాల్షియం నివారణకు పశువైద్యుల సూచనలు పాటించాలన్నారు. చూడి పశువులకు ఏడో నెల దాటిన తరువాత పాలు పితకడం నిలిపివేయాలన్నారు.

‘వృద్ధులను గౌరవిద్దాం’

తగరపువలస: వృద్ధులను ప్రతీ ఒక్కరు గౌరవించాలని ఒకటోవార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు అన్నారు. జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనదేశంలో 15 కోట్ల మంది వృద్ధులు ఉన్నారన్నారు. వారి నుంచి సమాజం నేర్చుకోవలసిన అనుభవ పాఠాల ఆవశ్యకతను తెలియజేశారు. ప్రభుత్వాలు వృద్ధులకు ఉచిత వైద్యం, ప్రయాణాలలో రాయితీలు, పింఛన్లు కల్పించాలన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
భీమిలి
9493185214

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
భీమిలి
9912220753
Office mail : sakshiadvtvsp@gmail.com